క్లుప్తంగా

అభివృద్ధి పనులపై సమీక్ష



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పాయకరావుపేట: మండలంలోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో ఎంపీడీవో జయప్రకాష్‌రావు శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులు ప్రారంభం, గోకులం షెడ్ల ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. మండలంలో గృహ నిర్మాణ శాఖ పనితీరు, ఇళ్ల నిర్మాణంపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఈవోఆర్‌డీ సిహెచ్.చంద్రశేఖర్, హౌసింగ్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు పాల్గొన్నారు.

బాలలకు క్రమశిక్షణ అవసరం



శిశు వికాసంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు

పాయకరావుపేట: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాల్సిన అవసరం ఉందని జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు అన్నారు. ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మంగవరం జెడ్పీహెచ్ స్కూల్లో శుక్రవారం బాలలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిశు వికాసం అనే అంశంపై ర్యాలీ నిర్వహించారు. బాలికలకు ఏమైనా ఇబ్బందికర పరిస్థితులు ఎదురైతే 100, 1098, 112 టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని లోవరాజు సూచించారు. శిశు వికాసం, దత్తత, బాల్య వివాహం, లైంగిక వేధింపులు తదితర అంశాలపై అవగాహనా కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ స్కూల్ హెచ్ఎం నిషా, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ వన్ యాప్‌లో పక్కాగా ఇళ్ల వివరాల నమోదు

పాయకరావుపేట: గ్రామాల్లోని ఇళ్ల వివరాలను పీఆర్ వన్ యాప్‌లో పక్కాగా నమోదు చేయాలని ఈవోఆర్‌డీ చంద్రశేఖర్ ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. శుక్రవారం నామవరం, మంగవరం గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది సూచనలు, సలహాలు అందించారు. యాప్ అప్‌లోడ్ చేయడంతో పాటు ఇంటి పన్నుల వసూలుపై దృష్టి సారించాలన్నారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధిపై సిబ్బంది దృష్టి సారించాలన్నారు.

16న మామిడి చెట్ల ఫల సాయం కోసం వేలం

పాయకరావుపేట: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పార్కులోని 13 మామిడి చెట్ల ఫల సాయం కోసం ఈ నెల 16న వేలం పాట నిర్వహించనున్నట్టు ఏఎస్‌డబ్ల్యూ ఒ.వి జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనడానికి ఆసక్తి గల వారు ముందుగా రూ.1000 ధరావత్తు చెల్లించాలన్నారు. అదే రోజున పార్కులో ఉన్న నిరుపయోగంగా పెరిగిన చెట్లు అమ్మకం కోసం కూడా వేలం పాట నిర్వహిస్తామన్నారు. ఈ పాటకు కూడా ముందుగా రూ.1000 ధరావత్తు చెల్లించాలన్నారు. పాటను దక్కించుకున్న వారు అదే రోజున పూర్తి నగదు చెల్లించవలసి ఉంటుందని ఆమె పేర్కొన్నారు. పార్కులో బొద్ద చెట్లు 3, తురంగ చెట్లు 20, గానుగ చెట్లు 25, ఒక సవర చెట్టు ఉన్నాయన్నారు.

16 టన్నుల సమీకృత మిశ్రమ దాణా పంపిణీ



కోటవురట్లలో సమీకృత మిశ్రమ దాణాను దించుతున్న కూలీలు

కోటవురట్ల: మండలానికి 16 టన్నుల సమీకృత మిశ్రమ దాణా వచ్చినట్టు పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ తెలిపారు. మండల కేంద్రంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయం వద్ద సమీకృత మిశ్రమ దాణాను శుక్రవారం రైతులకు అందజేశారు. ఏడీ మాట్లాడుతూ రైతుల ఇండెంట్ ప్రకారం 16 మంది రైతులకు 16 టన్నుల దాణా వచ్చినట్టు తెలిపారు. ఈ దాణా కిలో రూ.14 కాగా రాయితీపై రూ.6.50కు అందిస్తున్నట్టు తెలిపారు. పశు సంవర్ధక శాఖ ద్వారా పాడి రైతులకు అనేక రాయితీలు కల్పిస్తున్నామని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దూడల సంరక్షణతోనే పాడి వృద్ధి

- వాటి పెంపకంలో జాగ్రత్తలు తప్పనిసరి
- సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం
- పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నరేష్



కోటవురట్ల: దూడల పెంపకంలో తగు జాగ్రత్తలు పాటిస్తే సీజనల్ వ్యాధుల నుంచి తప్పించవచ్చని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పెట్ల నరేష్ తెలిపారు. వాటి సంరక్షణతోనే పాడి రంగం అభివృద్ధి సాధ్యమని చెప్పారు. ఈ నేపథ్యంలో దూడల పెంపకం, దూడల్లో వచ్చే వ్యాధులు, నివారణకు తీసుకోవలసిన చర్యలను ఆయన వివరించారు.

తెల్లని విరేచనాలు

దూడలకు మోతాదుకు మించి పాలు తాగించడం వల్ల అజీర్తి చేసి తెల్లగా పారుకుంటాయి. సూక్ష్మజీవులు, నట్టల వల్ల కూడా దూడల్లో పారుడు వ్యాధి సోకుతుంది. నివారణకు విరేచనాలు గమనించిన వెంటనే పాల మోతాదును తగ్గించి, గ్లూకోజు, ఉప్పు కలిపిన నీటిని దూడకు పట్టించాలి. వెంటనే డాక్టరు దగ్గరకు తీసుకెళ్లి వైద్యం చేయించాలి. పాలలో ఒక టీ చెంచా మోతాదులో యాంటిబయోటిక్ మందును కలిపి వరుసగా 5 రోజులు తాగించాలి. ఇలా చేయడం వల్ల వ్యాధిని నివారించవచ్చు. డాక్టరు సలహా మేరకు మందు పట్టించాలి.

న్యుమోనియా

దూడలకు చలి, ఈదురు గాలులు సోకితే న్యుమోనియా వ్యాధి వచ్చే ప్రమాదం ఉంది. అందు వల్ల దూడలను చలి, ఈదురు గాలులు తగలని ప్రదేశంలో కట్టాలి. వాటికి రాత్రి పూట వసతి కల్పించాలి. న్యుమోనియా వచ్చిన దూడలకు జ్వరం వస్తుంది. శ్వాస పీల్చడం కష్టమవుతుంది. వ్యాధి ముదిరితే చనిపోయే ప్రమాదం ఉంది. లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించి చికిత్స చేయించాలి.

బొడ్డు వాపు వ్యాధి

దూడ పుట్టినప్పుడు దాని బొడ్డును శుభ్రమైన బ్లేడు లేదా కత్తెరతో 2 అంగుళాల పొడ ఉంచి కత్తిరించాలి. దానికి టింక్చర్ అయోడిన్ పూయాలి. ఇలా చేయకపోతే బొడ్డు ద్వారా సూక్ష్మజీవులు ప్రవేశించి, బొడ్డు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉంది. బొడ్డు వాపు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా వెంటనే చికిత్స చేయించాలి.

మలబద్ధకం

దూడల్లో మలబద్ధకం సర్వసాధారణంగా కనిపిస్తుంది. చలికాలంలో గేదె దూడల్లో మలబద్ధక సమస్య ఎక్కువగా ఉంటుంది. దూడకు జున్నుపాలు తగినన్ని తాగిస్తే మలబద్ధకం రాదు. దూడ తాగే పాలల్లో కోడి గుడ్డు సొన, ఇంగువ, బెల్లం కలిపి రెండు రోజులు తాగిస్తే వ్యాధి నయమవుతుంది. లేదంటే ఎనిమా ఇప్పించాలి.

నట్టల బెడద

దూడలకు నట్టల బెడద సర్వ సాధారణంగా వస్తుంది. ఈ సమస్య గేదె దూడల్లో కూడా ఎక్కువగా కనిపిస్తుంది. నట్టలు ఉన్నట్లయితే తరచూ విరేచనాలు వచ్చి దూడలో ఎదుగుదల లోపిస్తుంది. వెంట్రుకలు బిరుసుగా తయారవుతాయి. కడుపు కిందికి జారి ఉంటుంది. దవడల మధ్య నీరు చేరి ఉంటుంది. దూడల్లో నట్టల నివారణకు సకాలంలో నట్టల నివారణ మందులు తాగించాలి. మొదటి సారిగా 8–10 రోజుల వయస్సులోను, ఆ తర్వాత ప్రతి నెలకు ఒకసారి చొప్పున నాలుగు నెలలపాటు క్రమం తప్పకుండా తాగించాలి.

కాక్సిడియోసిస్

కాక్సిడియోసిస్ వ్యాధి సోకడం వల్ల దూడలు రక్త విరేచనాలతో బాధపడతాయి. నివారణకు 15 రోజులకొకసారి పశువుల కొట్టంలో సున్నం చల్లితే వ్యాధి సోకకుండా చేయవచ్చు.

పేలు, మిన్నల్లులు, గోమార్లు, పిడుదుల సమస్య

గేదె దూడల్లో మూడు నెలలు దాటిన తర్వాత ప్రతి నెలకొకసారి చొప్పున ఏడాది వయస్సు వరకు దాని శరీరంపై వెంట్రుకలను కత్తిరిస్తూ ఉండాలి. ఇలా చేయడం వల్ల పేలు, గోమార్లు రాకుండా కాపాడుకోవచ్చు.

ఎట్టకేలకు ముందడుగు

- పెదకలవలాపల్లి–రజాల మధ్య శారదా నదిపై వంతెన నిర్మాణానికి ప్రణాళిక
- రూ.18 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు
- సాక్షిలో ప్రచురితమైన 'కర్రే ఊతం.. ప్రాణాలే పణం' కథనానికి స్పందన



వంతెన లేక ప్రజలు పడుతున్న కష్టాలపై గత నెల 28న సాక్షిలో ప్రచురితమైన కథనం



రాంబిల్లి(యలమంచిలి): రాంబిల్లి మండలం పెదకలవలాపల్లి–రజాల గ్రామాల మధ్య శారదానదిపై వంతెన నిర్మాణానికి ఎట్టకేలకు ముందడుగు పడింది. గత నెల 28న 'కర్రే ఊతం .. ప్రాణాలే పణం'శీర్షికన సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి యలమంచిలి పంచాయతీరాజ్ అధికారులు స్పందించారు. పెదకలవలాపల్లి–రజాల గ్రామాల మధ్య శారదానదిపై వంతెన లేక ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వారి కష్టాలను సాక్షిలో కళ్లకు కట్టినట్టు చూపిస్తూ ప్రచురితమైన కథనానికి యలమంచిలి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి రూ.18 కోట్లు అవసరమని జిల్లా పంచాయతీరాజ్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించినట్లు రాంబిల్లి ఎంపీడీవో జయమాధురి తెలిపారు. శారదానదిపై వంతెన నిర్మాణం చేపట్టడం ద్వారా 10 గ్రామాల రైతులకు, ప్రజలకు కష్టాలు తీరుతాయని సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

తుపాను షెల్టర్ పరిశీలన



మెలిపాకలోని తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు

మునగపాక: మండలంలోని మెలిపాకలో శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్‌ను తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. 40 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం ప్రస్తుతం శిథిలం కావడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సాక్షి దినపత్రికలో 'షెల్టర్ ఇవ్వని తుపాను భవనాలు'శీర్షికన ఇటీవల ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు శుక్రవారం మెలిపాకలోని శిథిల తుపాను భవనాన్ని పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తుపాను భవన పరిస్థితిని తీసుకెళ్తానన్నారు. ప్రస్తుత భవనాన్ని తొలగించేందుకు కలెక్టర్ నుంచి అనుమతులు తీసుకుంటామని చెప్పారు. లోతట్టు ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఈవో వేణుగోపాలరావు

మునగపాక: భవిష్యత్తును నాశనం చేసే డ్రగ్స్‌కు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎంఈవో డి.వేణుగోపాలరావు కోరారు. శుక్రవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్‌కు అలవాటు పడితే కుటుంబాన్ని సైతం నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్‌ను నివారించేందుకు తల్లిదండ్రులతో పాటు పిల్లలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకోసం క్లస్టర్ మొబైల్ రిజర్వ్ టీచర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో–2 బుద్ధ శివనాయుడు, హెచ్ఎంలు గాలి అప్పారావు, శంకరరావు, విజయవాణి, నరసింహారావు, రామ్మోహనరావు, సృజన, సీఆర్ఎంటీలు కర్రి లక్ష్మీనారాయణ, బి.అచ్యుతకృష్ణ, సూకేష్, సత్తిబాబు, గోవింద, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సదస్సులకు స్పందన అంతంత మాత్రమే



చినరామభద్రపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తున్న అధికారులు

నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో శుక్రవారం ప్రారంభమైన రెవెన్యూ సదస్సులకు స్పందన అంతంత మాత్రంగా ఉంది. వచ్చే నెల 8వ తేదీ వరకు నెల రోజుల పాటు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నర్సింహమూర్తి తెలిపారు. తొలిరోజు చినరామభద్రపురం, దేవవరం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. జాతీయ రహదారి నుంచి చినరామభద్రపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు ఇరువైపులా ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించి రోడ్డు వెడల్పు చేయాలని గ్రామస్తులు అధికారులకు వినతి పత్రం అందజేశారు.

- దేవవరంలో జరిగిన గ్రామసభలో పలువురు రైతులు పట్టాదారు పాసుపుస్తకాలు, వెబ్‌ల్యాండ్‌లో నమోదు, ఇళ్ల స్థలాలు, జగనన్న కాలనీలకు రోడ్డు సదుపాయం కల్పించాలంటూ వినతులు సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఆన్‌లైన్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని తహసీల్దార్ నర్సింహమూర్తి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీ అన్నాజీరావు, ఆర్ఐ కన్నబాబు, సర్పంచ్ రాఘవ కుమారి, వార్డు మెంబర్లు దండు బలరామరాజు, సఖిరెడ్డి వెంకటరమణ, బత్తుల రమణబాబు, నాయకులు సత్యనారాయణ, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలలైనా పరిష్కారం కాని సమస్య

కోటవురట్ల: మూడు నెలలుగా తహసీల్దారు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తన భూసమస్య పరిష్కారం కాలేదని ఓ రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. కైలాసపట్నంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో అదే గ్రామానికి చెందిన చేదూరి వేణు అనే రైతు తన భూమి ఆన్‌లైన్ కాలేదంటూ తహసీల్దారు తిరుమలబాబుకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారుడి వివరణ ప్రకారం చేదూరి నూకరాజుకు 2.13 ఎకరాల మెట్ట భూమి ఉండగా.. అతను మృతి చెందడంతో అతని భార్య చేదూరి సీత పేరున పట్టాదారు పాసు పుస్తకం బదలాయించారు. అయితే ఇందులో 0.44 ఎకరాలు మాత్రమే ఆన్‌లైన్ చేశారని, మిగతా భూమి వేరే వ్యక్తి పేరున ఆన్‌లైన్‌లో నమోద చేసినట్టు ఉందని తెలిపాడు. ఇదే విషయమై అనేక పర్యాయాలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అలాగే విద్యార్థులు, ఫ్యామిలీ మెంబరు సర్టిఫికెట్ల జారీలో రెవెన్యూ సిబ్బంది అలసత్వం వహిస్తున్నారని, వెంటనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దారును పలువురు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శానాపతి రమణ, ఉప సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ, సబ్ రిజిస్ట్రార్, అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 18 దరఖాస్తులు

పాయకరావుపేట: మండలంలోని శ్రీరాంపురం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సుకు 18 దరఖాస్తులు అందాయని తహసీల్దార్ జి.శ్రీనివాసరావు తెలిపారు. రైతుల సమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ సదస్సులో ఆర్ఐ త్రినాథ్, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లి(యలమంచిలి): రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాంబిల్లి మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి కోరారు. రాంబిల్లి మండలంలో మురకాడ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులో ఆమె పాల్గొని రెవెన్యూ సదస్సు కరపత్రాలను తహశీల్దారు శ్రీనివాసరావుతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎ.రవికుమార్, సర్పంచ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


రెవెన్యూ సదస్సుల్లో 25 దరఖాస్తులు

ఎస్.రాయవరం: మండలంలో లింగరాజుపాలెంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ప్రజల తమ వ్యక్తిగత సమస్యల గురించి అర్జీలు పెట్టుకున్నారు. పట్టాదారు పాసు పుస్తకాలు, వెబ్ ల్యాండ్‌లో నమోదు తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మనోరమ, తహసీల్దార్ రమేష్‌బాబు హాజరై వినతులు స్వీకరించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు కోరారు. మండలంలోని మెలిపాక గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో దోహదపడతాయన్నారు. భూ వివాదాలకు తావులేకుండా తగు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మెలిపాక దళితవాడను ఆనుకొని సాగునీటి కాలువ ఆక్రమణకు గురైందని వైఎస్సార్‌సీపీ దళిత విభాగం నేత గుంటూ అప్పారావు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు, రైతులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

మత్తుతో పెరుగుతున్న నేరాలు



ఎస్సై సావిత్రికి వినతిపత్రం అందిస్తున్న ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యం, మంగతాయారు

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణం, మండల పరిధిలో గంజాయి, మద్యం ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దొరుకుతున్నాయని, వీటికి అలవాటుపడిన యువత మద్యం మత్తులో నేరాల బాట పడుతున్నారని యలమంచిలి పట్టణ ఎస్ఐ కె.సావిత్రికి ఐద్వా జిల్లా అధ్యక్ష, సంయుక్త కార్యదర్శులు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆమెను కలిసిన ఐద్వా నేతలు గంజాయి విక్రయాలపై గట్టి నిఘా పెట్టి యువత, విద్యార్థులు పెడత్రోవ పట్టకుండా చూడాలని కోరారు. మత్తులో మహిళలపై రాష్ట్రం, జిల్లాలో అనేక అఘాయిత్యాలు జరుగుతున్నాయన్నారు. మహిళల రక్షణకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, సంయుక్త కార్యదర్శి మంగతాయారు పాల్గొన్నారు.

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్

వర్ధంతి సందర్భంగా బాబాసాహెబ్‌కు ఘన నివాళి



పాయకరావుపేటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగులు



అచ్యుతాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి అంజలి ఘటిస్తున్న యూటీఎఫ్ నాయకులు



యలమంచిలి ఎంపీడీవో కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ గోవింద్, అధికారులు



మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు,అధికారులు



మునగపాకలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్



దిమిలిరోడ్డు కూడలిలో..



మునగపాక దళితవాడలో అంజలి ఘటిస్తున్న కాలనీ వాసులు

పాయకరావుపేట: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగానే వైఎస్సార్ సీపీ పాలనలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట వేశామన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా అంబేడ్కర్ ఆశయాలు, సిద్ధాంతాలకు తూట్లు పొడుస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు డి.నానాజీ, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోడపాటి గోవిందు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి వై.అన్నవరం, నాయకులు జగతా శ్రీనివాస్, దేవవరపు వెంకటేశ్వరరావు, దోమాడ సుందర్రావు, నెలపర్తి నాగరాజు, కాకాడ కృష్ణ, తిరుమలరాజు నరసింహారాజు, పులి సీతారత్నం, కెకెఆర్ ఎస్ లత, పల్లేల వెంకట్ పాల్గొన్నారు.

- మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి డిప్యూటీ తహసీల్దార్ జి.ఆనంద్, ఎంఈవో కె.ఎస్.గాంధీ, దళిత నాయకులు పెదపాటి మేఘరంజన్, ఐ.ఎస్.మూర్తి, ఇంజరపు సూరిబాబు పూల మాలలు వేసి నివాళులర్పించారు. దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తన స్వగృహం వద్ద పరివర్తనా నిలయంలో అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటించారు.


యలమంచిలి రూరల్: సమాజానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప దార్శనికుడు అంబేడ్కర్ అని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ కొనియాడారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కేఎస్ కొండలరావు, ఎంఈవో–2 అరుణ్ కుమార్, ఏవో ప్రసాదరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు రాపేటి సంతోష్, సుంకర మరిణేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మర్రి రాజు, ఈవోపీఆర్డీ వి.దీపిక, ఏటికొప్పాక కార్యదర్శి ప్రసాద్, చంద్రకళ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

- దిమిలిరోడ్డు కూడలి వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణానికి చెందిన దళిత నేతలు గొంపాని అప్పారావు, బొచ్చ అప్పారావు, ఈరిగిల చంటి, గారా మురళీరాజు, మలిజెట్టి వెంకట్రావు, పాము చిన్ని కుమార్, జీవన్ కుమార్, రాజు పాల్గొన్నారు.
- దేశానికి రాజ్యాంగాన్ని అందించి, ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేసిన గొప్ప మహనీయుడు అంబేడ్కర్ అని యలమంచిలి మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ తన జీవితాన్ని అణగారిన వర్గాల సంక్షేమానికి అంకితం చేశారన్నారు. రెవెన్యూ అధికారి టి.విశ్వేశ్వరరావు, పట్టణ ప్రణాళికాధికారి శ్రీలక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: అచ్యుతాపురంలోని అంబేడ్కర్ విగ్రహానికి యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడు మద్దిల నానాజీ, నాయకులు కె.సుభాషిణి దేవి, వి.లక్ష్మి, జి.ఎస్.ప్రకాశ్, ఎం.వి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ కోరారు. అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం మండల వ్యాప్తంగా నిర్వహించారు. మునగపాకలోని సంతబయిలలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కరిజమ్ పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, పీఏసీఎస్ మాజీ పర్సన్ ఇన్‌చార్జి కోనపల్లి రామ్మోహనరావు, పెద్దలు మారిశెట్టి అప్పారావు, ఆదారి కాశీబాబు, బొడ్డేడ రామునాయుడు, బూడిద రామారావు, దిమ్మల నూకరాజు, పిల్లి అప్పారావు, బీలా లక్ష్మణరావు, బీలా అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి సర్పంచ్ అప్పారావు అంజలి ఘటించారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మునగపాక దళితవాడలో అంబేడ్కర్ చిత్ర పటానికి పలువురు పూలమాల వేసి అంజలి ఘటించారు.

పేరెంట్స్ సమావేశం విధిగా నిర్వహించాలి



నక్కపల్లి బాలికల పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీడీ శశీదేవి

నక్కపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం పేరెంట్స్ మీటింగ్ అన్ని పాఠశాలల్లోను విధిగా నిర్వహించాలని డీఆర్‌డీఏ పీడీ శశీదేవి సూచించారు. పేరెంట్స్ మీటింగ్ నిర్వహణకు ప్రత్యేక అధికారిగా నియమితులైన ఆమె శుక్రవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంఈవోతో సమావేశమయ్యారు. మండలంలో పాఠశాలల్లో ఈ సమావేశానికి చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి పాఠశాలలో ఈ సమావేశం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో విద్యా బోధన తీరు, విద్యార్థుల ప్రతిభ, పాఠశాలల్లో కల్పిస్తున్న సదుపాయాలు, మధ్యాహ్న భోజనం వివరాలను విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులకు పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం కూడా ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు. అనంతరం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశానికి చేసిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు.

చూచుకొండలో నేడు గౌరీ పరమేశ్వరుల ఉత్సవం

మునగపాక: చూచుకొండలో శనివారం గౌరీ పరమేశ్వరుల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఏటా డిసెంబర్ నెలలో పెంటకోట, కాండ్రేగుల కుటుంబాలకు చెందిన వారంతా గౌరీ పరమేశ్వరుల ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా గ్రామస్తుల సహకారంతో ఉత్సవాన్ని నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు.

పీఎం సూర్య ఘర్ పథకంపై అవగాహన నేడు

పాయకరావుపేట: పీఎం సూర్య ఘర్ ఉచిత విద్యుత్ పథకంపై శనివారం ఉదయం 10 గంటలకు రఘుపతి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు నిర్వహిస్తామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.రాజశేఖర్ తెలిపారు. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది, సోలార్ వెండర్‌లు హాజరై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ 73825 85672, ఏఈఈ 94408 12546 నంబర్లలో సంప్రదించాలని కోరారు.